

నగర పంచాయతీ కమిషనర్‌గా రవివర్మ


బాధ్యతలు స్వీకరిస్తున్న పి.రవివర్మ

ప్రజాశక్తి - ముమ్మిడివరం

నగర పంచాయతీ కమిషనర్‌గా పి.రవి వర్మ సోమవారం బాధ్యతలు చేపట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సాధారణ బదిలీల్లో భాగంగా కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ లో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తూ ముమ్మిడివరం నగర పంచాయతీ కమిషనర్‌గా బదిలీపై వచ్చారు. సోమ వారం కార్యాలయం కమిషనర్ ఛాంబర్‌లో రవివర్మ భాధ్యతలు స్వీకరించారు. అనంతరం చైర్మన్ ప్రవీణ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కమిషనర్‌ను మేనేజర్ నూకరాజు, ఏఇ పివి.సుధాకర్, ఆర్ఐ భాస్కరరావు, జెఎఇ రామకృష్ణ, మెప్మా సిటి మిషన్ మేనేజర్ భాస్కర్ తదితరులు అభినందించారు.

తొలి బడ్జెట్‌లోనే నిరాశ

- ఎండమావిలా సూపర్ సిక్స్ పథకాలు
- కోటిపల్లి-నర్సాపురం రైల్వే లైన్‌పై లేని ప్రస్తావన
- ఉమ్మడి జిల్లాల్లో సమస్యలు తిష్ట

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

కూటమి ప్రభుత్వం తొలి బడ్జెట్‌లోనే నిరాశ పరిచింది. గత వైసిపి ప్రభుత్వం ఆర్థిక అరాచకాలకు పాల్పడిదంటూ 2024 ఎన్నికల ప్రచారంలో కూటమి నేతలు ఎండగట్టిన విషయం విదితమే. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను చక్కదిద్దుతామంటూ అనేక హామీలు గుప్పించారు. సూపర్ సిక్స్ పథకాల పేరు చెప్పి ప్రజలను ఆశల పల్లకి ఎక్కించారు. తాజా బడ్జెట్‌లో కేటాయింపులకు అవసరాలకు పొంతనే లేదంటూ విశ్లేషకులు తేల్చి చెబుతున్నారు. బడ్జెట్ సమావేశాలు మొత్తంగా తొలిరోజు ఆత్మస్తుతి పరనింద అనే చందంగా సాగిందని చెప్పడంలో అతిశయోక్తి లేదని స్పష్టమవుతోంది. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్ మరోసారి జిల్లా వాసులను నిరాశ పరిచింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని తూర్పు గోదావరి, కాకినాడ, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలకు తగిన నిధులు కేటాయించకపోవడంతో ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కూటమి అభ్యర్థులు క్లీన్ స్వీప్ చేసేంతలా జిల్లా వాసులు బ్రహ్మరథం పట్టారు. ఈ నేపథ్యంలో బడ్జెట్‌పై జిల్లా వాసులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, సాగునీటి పారుదల రంగానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వలేదు. కోనసీమ రైల్వే లైన్‌కు రాష్ట్ర ప్రభుత్వం వాటా చెల్లించాల్సి ఉంది. ప్రతి బడ్జెట్‌లోనూ నిరాశే ఎదురవుతోంది. ఈసారి కూడా నిధుల మాట ఎత్తలేదు. ముఖ్యమైన పర్యాటక, పారిశ్రామిక అభివృద్ధిపై కూడా సారీ అనేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూనే పథకాల అమలుకు నిధులు కేటాయింపులపై స్పష్టత ఇవ్వలేదు. గత ప్రభుత్వం ఉప్పాడ హార్బర్ పనులకు నిధులను కేటాయిస్తున్నట్లు ప్రకటించింది. కానీ ఈ ప్రాజెక్టుకు ఇప్పటి వరకూ 40 శాతం నిధులనే కేటాయించగా ఈ బడ్జెట్‌లో మిగిలిన నిధుల గురించి ప్రస్తావన రాలేదు .ఇలా పలు అంశాలకు ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో జిల్లా వాసులు తీవ్ర నిరాశ చెందుతున్నారు. కీలకమైన కోటిపల్లి-నర్సాపురం రైల్వే లైను పూర్తి కావడం కోసం కోనసీమ ప్రజానీకం గత 22 ఏళ్లుగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం దఫదఫాలుగా రైల్వే బడ్జెట్‌ల్లో మొత్తం రూ.1100 కోట్లు కేటాయించింది. మొత్తం నిర్మాణ వ్యయంలో రాష్ట్ర ప్రభుత్వం 25 శాతం వాటా ఇవ్వాల్సి ఉంది. సుమారు రూ.350 కోట్లు రాష్ట్ర వాటా ఇవ్వాల్సి ఉంది. అనేక వినతులు ఇవ్వగా 55 కిలోమీటర్ల పొడవునా ఉన్న ఈ లైన్‌కు భూ సేకరణ చేస్తామని అందుకు అయ్యే ఖర్చును భరిస్తామని గత ప్రభుత్వం రైల్వేకు గతంలోనే తెలిపింది. భూ సేకరణ నిధుల కేటాయింపుపై గతంలో ఇచ్చిన హామీ మేరకు ప్రాజెక్టు కొనసాగింపుగా ఈ బడ్జెట్‌లో నిధుల మాట ఎత్తలేదు. విశాఖ-కాకినాడ మధ్య పెట్రో రసాయనాల పెట్టుబడుల కేంద్రం వస్తుందని కాకినాడ జిల్లా వాసులు ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్నారు. కాకినాడ సెజ్‌లో నేటికీ పరిశ్రమల జాడ కనిపించడం లేదు. జిల్లా కేంద్రాలైన రాజమహేంద్రవరం, కాకినాడ వంటి ప్రధాన పట్టణాలలో తాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. గోదావరి జలాలను నిడదవోలు, కొవ్వూరు పట్టణ వాసులకు అందిస్తామంటూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ఆచరణలో నిధుల కేటాయింపునకు నోచుకోలేదు. జిల్లాలో పలు రహదారుల పనులకు భారీగా సొమ్ములు కేటాయించాల్సి ఉంది. గతంలో నిధులను కేటాయించామని ప్రభుత్వం చెప్పిన నాటి నుంచి ఇప్పటివరకు రహదారుల పరిస్థితి అధ్వానంగానే ఉంది. కాకినాడలో విడుదలయ్యే 50 మిలియన్ లీటర్ల వ్యర్థ జలాలను శుద్ధి చేసేందుకు గతంలో రూ.10 కోట్లు వెచ్చించాలి. కానీ నిధులను కేటాయించక పనులు ప్రారంభం కాలేదు. గోదావరి డెల్టా ఆయకట్టలో వేసవిలో నీటి లభ్యత సమస్య తీవ్రంగా ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో గోదావరి డ్రైన్ల ఆధునీకరణ పనుల చేయాల్సి ఉన్నా నిధులు కేటాయించలేదు. ఇలా పలు అంశాలకు ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో జిల్లా వాసులు తీవ్ర నిరాశ చెందుతున్నారు. తూర్పు గోదావరి జిల్లాకు సంబంధించి ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ గేట్ల ఆధునికీకరణకు నిధులు కొరత వెంటాడుతోంది. తొలి బడ్జెట్లో కూడా నిధులు కేటాయింపు లేదు. దాదాపు 10 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించే కీలకమైన గేట్ల ఆధునీకరణను విస్మరించడంతో ఉమ్మడి జిల్లా వాసులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగునీటి ప్రాజెక్టులను పూర్తిగా విస్మరించడంతో జిల్లా రైతాంగం తీవ్ర అసహనం వ్యక్తం చేస్తుంది. స్థూల ఆదాయంపై అంకెల గారడీ వినిపించారు. నూతన జిల్లాల ఏర్పాటులో భాగంగా ఏర్పడిన తూర్పు గోదావరి, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అభివద్ధి కోసం ఏ రకమైన నిధులూ బడ్జెట్లో కేటాయించలేదు. పారిశ్రామిక రంగానికి దూరంగా ఉన్న ఈ జిల్లాని ఆ దిశగా అభివద్ధి చేయాలని ఆలోచన ఏ కోశానా కనబడలేదు. కోనసీమలో ఇరిగేషన్ డ్రైనేజీల అభివద్ధి కోసం నిధులు కేటాయించలేదు. ఈ జిల్లాలో 1.36 లక్షల ఎకరాల్లో కొబ్బరి సాగవుతుంది. కొబ్బరి సాగులో రాష్ట్రంలోనే జిల్లాది మొదటి స్థానం. ఇక్కడి ఉత్పత్తుల విలువ సుమారు రూ.736 కోట్లుగా ఉండగా ప్రత్యక్షంగా లక్ష మంది, పరోక్షంగా మరో 3 లక్షల మందికిపైగా ఉపాధి పొందుతున్నారు. కొబ్బరి ఆధారిత పరిశ్రమల ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహం కరువైంది.

టీచర్స్ ఎంఎల్‌సి ఎన్నికలకు నోటిఫికేషన్

- నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి
- ఈ నెల 18 వరకూ దాఖలుకు అవకాశం
- 19 న పరిశీలన, డిసెంబర్ 5న పోలింగ్, 9న కౌంటింగ్

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఉప ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ విడుదలయ్యింది. తూర్పు, పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి ఎంఎల్‌సి ఎన్నికకు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ షాన్‌మోహన్ సోమవారం ఎన్నికల నోటీసు జారీ చేశారు. ఈ ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులు కాకినాడ కలెక్టర్ కార్యాలయంలోని కోర్టు హాల్లో నామినేషన్లు అందజేయవచ్చునని ఆయన తెలిపారు. ఈ నెల 11 తేదీ నుంచి 18 వరకూ పని దినాల్లో ఉదయం 11 గంటల నుండి మధ్నాహ్నం 3 గంటల మధ్య రిటర్నింగ్ అధికారి లేదా అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారికి తమ నామినేషన్లు దాఖలు చేసుకోవాలని తెలిపారు. నామినేషన్ పత్రాలను ఈ నెల 19న ఉదయం 11 గంటలకు పరిశీలిస్తారన్నారు. 21న గడువు ఉంటుందన్నారు. డిసెంబరు 5న ఉద మధ్నాహ్నం 3 గంటల వరకూ నామినేషన్ల ఉపసంహరణకు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య పోలింగ్ జరుగుతుందని, 9న కౌంటింగ్ నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు.

16,316 మంది ఓటర్లు

ప్రచురించిన తుది జాబితా ప్రకారం ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలో 16,316 మంది టీచర్ ఓటర్లు నమోదయ్యారు. నామినేషన్ ఫారాల సరఫరా, ఇతర సమాచారం, సామగ్రి అందించేందుకు ఈ నెల 11 నుంచి కలెక్టరేట్‌లో హెల్ప్ డెస్క్ అందుబాటులో ఉంచారు. ప్రజలకు సమాచారం కోసం కాల్ సెంటర్ కూడా ఏర్పాటు చేసిన అధికారులు 1950 టోల్‌ఫ్రీ నెంబరును కేటాయించారు. ఈ నెల 11 నుంచి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిందని అధికారులు ప్రకటించారు.

ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ

ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులు కాకినాడ కలెక్టర్ కార్యాలయంలోని కోర్టు హాలులో ఈ నెల 11 నుంచి 18 వరకు అన్ని పని దినాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ తమ నామినేషన్లు ఫారం-2ఇలో దాఖలు చేసుకోవాల్సి ఉంటుంది. అభ్యర్థి నామినేషన్‌తో పాటు ఫారమ్-26లో నోటరీ చేయించిన అఫిడవిట్ సమర్పించాలి. అన్ని కాలమ్‌లు విధిగా నింపాల్సి ఉంటుంది. నామినేషన్‌ను 10 మంది తూర్పు-పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ ఎంఎల్‌సి నియోజకవర్గ ఓటర్లు ప్రతిపాదించాల్సించి ఉంటుంది. రాజకీయ పార్టీల తరపున పోటీ చేసే అభ్యర్థులు ఫారమ్- ఎఎ, ఫారమ్- బిబి సమర్పించాలి. అభ్యర్థి వయస్సు 30 కంటే తక్కువగా ఉండకూడదు.

రిటర్నింగ్ అధికారిగా కలెక్టర్

ఉభయ గోదావరి జిల్లాల ఎంఎల్‌సి నియోజకవర్గ ఎన్నికలకు కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి రిటర్నింగ్ అధికారిగా, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా కాకినాడ జిల్లా డిఆర్ఒ జె.వెంకటరావు,, పశ్చిమ, ఏలూరు, తూర్పు గోదావరి, కోనసీమ జిల్లాల డిఆర్ఒలు వ్యవహరిస్తారు. జిల్లాలో ఎంసిసి పర్యవేక్షణకు మెప్మా పీడీని నోడల్ ఆఫీసర్‌గా నియమించారు. ఫ్లయింగ్, స్టాటిక్ సర్వయిలెన్స్ బృందాలతో చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు.

నేడు పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి నామినేషన్

ఉపాధ్యాయ, అధ్యాపక, ప్రజా సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ టీచర్స్ ఎంఎల్‌సి అభ్యర్థి గోపీమూర్తి మంగళవారం కాకినాడలో నామినేషన్ దాఖలు చేయనున్నారు. అనంతరం బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పరిధిలో కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరు కానున్నారు. అభ్యర్థి ఉదయం 7.30 గంటలకు భీమవరం నుంచి ర్యాలీగా బయలుదేరుతారు. ఏలూరు జిల్లా, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం, మండపేట, రామచంద్రపురం మీదుగా ఉదయం 11.30 గంటలకల్లా కాకినాడ చేరుకుంటారు. స్థానిక అన్నమ్మ ఘాటీ నుంచి వాహనాలతో ర్యాలీగా బాలాజీ చెరువు సెంటర్ మీదుగా మధ్నాహ్నం 12 గంటలకు కలక్టరేట్‌కు చేరుకుంటారు. నామినేషన్ అనంతరం ధర్నా చౌక్ లేదా లేడీస్ క్లబ్ ప్రాంగణంలో బహిరంగ సభ ఉంటుంది.

సాయం అందజేస్తున్న దొనిపాటి అన్నపూర్ణ

బాధిత కుటుంబాలకు రూ.25 వేల సాయం

ప్రజాశక్తి - సఖినేటిపల్లి

మూడు బాధిత కుటుంబాలకు ఎన్‌ఆర్‌ఐ దొండపాటి శశికిరణ్ రూ.25 వేలు సాయం అందించారు. సఖినేటిపల్లి మండలం గొంది గ్రామానికి చెందిన బాలిక బర్రె దుర్గాభవాని విద్యుత్ షాక్ కి గురై వైద్యం చేయించుకొంటున్నారు. కేశవదాసుపాలెంకు చెందిన దేవ ఉషారాణి బ్రెయిన్ ట్యూమర్ కారణంగా బ్రెయిన్ ఆపరేషన్ చేయించుకున్నారు. అదే గ్రామానికి చెందిన లంక రమేష్ అంగవైకల్యంతో బాధపడుతున్నారు. ఈ విషయం స్నేహితుల ద్వారా తెలుసుకొన్న వైసిపి నాయకులు దొండపాటి శశికిరణ్ బాధితులు ముగ్గురికి రూ.25 వేలను ఎన్నారై, ఖతార్ వైసిపి నాయకులు దొండపాటి శశికిరణ్ తల్లి సఖినేటిపల్లి జెడ్‌పిటిసి సభ్యులు దొండపాటి అన్నపూర్ణ చేతుల మీదుగా బర్రె దుర్గాభవానికి రూ. 10 వేలు అందజేశారు. దేవ ఉషారాణికి రూ.10 వేలను జెడ్‌పిటిసి సభ్యురాలు అన్నపూర్ణ, నల్లి రాజకుమార్ చేతుల మీదుగా అందజేశారు. లంక రాజేష్‌కు జెడ్‌పిటిసి సభ్యురాలు అన్నపూర్ణ, కొల్లాబత్తుల చిట్టిబాబు చేతుల మీదుగా రూ.5 వేలు అందజేశారు. కార్యక్రమంలో వైసిపి నాయ కులు యెనుముల ఏసుబాబు, కొల్లాబత్తుల లాజరు పాల్గొన్నారు. గ్రామ పెద్దలు దొండ పాటి శశికిరణ్‌కి కతజ్ఞతలు తెలియజేశారు.

ధరలు అదుపు చేయడంలో ప్రభుత్వాలు విఫలం

సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆండ్ర మాల్యాద్రి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆండ్ర మాల్యాద్రి దుయ్యబట్టారు. సిపిఎం కేంద్ర కమిటీ పిలుపు మేరకు ప్రజాసమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 8 నుంచి 15 వరకు జరుగుతున్న ప్రజా పోరులో భాగంగా సోమవారం జిల్లా కమిటీ సభ్యుడు జి దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో ఆండ్ర మాల్యాద్రి బృందం ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని కొండాలమ్మ చింత ప్రాంతంలోని జిఎంసి బాలయోగి కాలనీ, బాలయోగి పేట, రెడ్డివారి పాలెం మరియు తిల్లమ్మ చెరువు పేట తదితర గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలోని మతోన్మాద బిజెపి, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వాలు పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలను అదుపు చేయడంలో విఫలమయ్యాయన్నారు. దీనితో సామాన్యుల జీవన స్థితిగతులు దుర్భరంగా మారాయని బృందానికి మొరపెట్టుకున్నారు. ఒక పక్క ఉపాధి అవకాశాలు లేక, మరో పక్క ఉద్యోగ నియామకాలు చేపట్టక పోవడంతో నిరుద్యోగులు వలసలు పోతున్నారు పరిస్థితులు తలెత్తాయని, డిఎస్‌సి వాయిదాపడిందని, గిరిజన నిరుద్యోగులకు ప్రత్యేకాంధ్ర ప్రకటించలేదని, గ్రూప్1,2 పరీక్షలు షెడ్యూల్ ప్రకటించకపోవడం దారుణమని బృందానికి మొరపెట్టుకున్నారు. కూటమి ప్రభుత్వం ఒక్క పైసా కూడా కరెంట్ ఛార్జీలు పెంచమంటు నేడు ట్రూ అప్ చార్జీల పేరుతో రూ.20 వేల కోట్ల భారం ప్రజలపై మోపిందని, మహిళలు, పిల్లలు మరియు దళితులపై అత్యాచారాలు దాడులు పెరిగిపోయాయన్నారు. ఉచిత ఇసుక విధానం అమల్లోకి రాక భవన నిర్మాణ కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. కూటమి ప్రభుత్వం విచ్చల విడిగా మద్యం షాపులు బెల్టు షాపులకు అనుమతులు ఇవ్వడంతో గ్రామాల్లో మద్యం ఏరులై పారుతుందని, ప్రజల ఆరోగ్యానికి హని కలిగిస్తున్న బెల్ట్ షాపులను తక్షణమే తొలగించాలని బృందం దృష్టికి తీసుకు వచ్చారు.ప్రజల సమస్య లను విన్న మాల్యాద్రి మాట్లాడుతూ ఉచిత గ్యాస్‌ను అర్హులైన తెల్ల రేషన్ కార్డు దారులకు తక్షణమే అందించాలని, గ్రామాల్లో మౌలిక సౌకర్యాలైన తాగునీరు, డ్రెయిన్ వ్యవస్థను మెరుగుపరచాలని, ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలంతో పాటు గృహ రుణాలు మంజూరు చేయాలని, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతితో పాటు కూటమి ప్రభుత్వం మేనిఫెస్టో లో పేర్కొన్న సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. వీటిని వెంటనే అమలు చేయాలనే ప్రజాపోరు యాత్రలో భాగంగా ఈ నెల 14న కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నా కు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దొమ్మేటి వీర రాఘవులు, మూడే చినసత్యనారాయణ, కాశి సత్యనారాయణ, పోలమూరి శ్రీనివాసరావు, లక్ష్మణ రావు, గెడ్డాడ సాయిబాబు, జగడం శ్రీనివాసరావు, అహ్మద్ హుస్సేన్ ప్రసాద్ లతో పాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.

ప్రజాపోరు నిర్వహిస్తున్న సిపిఎం నాయకుల బృందం


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

200 మందికి కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - అల్లవరం

కొమరగిరిపట్నం క్షత్రియ సేవా సమితి వారి ఆధ్వర్యంలో ఎడాప్ట్ ఎ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్ (యూఎస్ఏ) వారి ఆర్థిక సహాయముతో 200 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. సోమవారం కొమరగిరిపట్నం రాజుపాలెం క్షత్రియ సేవా సమితి భవనము నందు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు రెండు వంద మందికి కంటి వైద్య పరీక్షలు చేయించుకోగా 104 మందికి ఉచితముగా కళ్లద్దాలు అందజేశారు. తొమ్మిది మందికి కంటి ఆపరేషన్ నిమిత్తము ఫౌండేషన్ సొంత ఖర్చులతో వేమగిరిలో గల పరమ హంస యోగానంద కంటి ఆసుపత్రికి (ఎల్‌వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ)కు తరలించారు. ఆపరేషన్ అనంతరం 13న వారి ఇంటికి తిరిగి చేరిస్తారన్నారున. ఈ కార్య క్రమంలో ఫౌండేషన్ కోమరగిరిపట్నం కన్వీనర్ దాట్ల గోపిరాజు, ఆర్ బంగారురాజు, ఎం.శ్రీనురాజు, ఎం.సురేష్ రాజు, ఎ.సురేష్ వర్మ, ఎం.సుధీర్ రాజు, ఎం.సీతారామరాజు, ఎన్.వాసు, ఎన్.రామరాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంరక్షణపై అవగాహన

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ఆత్రేయపురంలో జూనియర్ కళాశాల్లో మాట్లాడుతున్న సిఐ విద్యాసాగర్

మండల కేంద్రం ఆత్రేయపురం మహాత్మా గాంధీ జూనియర్ కళాశాల నందు సోమవారం రావులపాలెం రూరల్ సిఐ సిహెచ్ విద్యాసాగర్ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు విద్యార్థులకు మహిళ సంరక్షణ అనే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిఐ విద్యాసాగర్ మాట్లాడుతూ మహిళలు ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఎలా ఉండాలో వివరించారు. ఎటువంటి పరిస్థితులైన అధిగమించి అప్రమత్తతతో ధైర్యంగా ఉండాలన్నారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా తల్లిదండ్రులకు లేదా ఉపాధ్యాయులకు , పోలీసు వారికి తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఎస్ రాము, సచివాలయ మహిళా పోలీసులు పాల్గొన్నారు.. **ఉప్పలగుప్తం:** భీమనపల్లి శ్రీ శిరంగు రంగనాయకమ్మ జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో సోమవారం హెచ్ఎం ఎన్.సత్యనారాయణ అధ్యక్షతన మహిళా సంరక్షణ పై విద్యార్థినులకు ఎస్ఐ సిహెచ్.రాజేష్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలోఉపాధ్యాయులు అరవ నాయుడు, రాయి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్తలకు సభ్యత్వాలతో భరోసా

ప్రజాశక్తి - అంబాజీపేట

టిడిపి సభ్యత్వాల కార్యకర్తల కుటుంబాలకు భరోసా కల్పిస్తుందని మండల టిడిపి అధ్యక్షుడు కార్యదర్శిలు దంతులూరి శ్రీను రాజు, గూడాల ఫణి అన్నారు. నందంపూడి గ్రామంలో గ్రామ శాఖ అధ్యక్షులు కేతా అర్జునుడు ఆధ్వర్యంలో సోమవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న గ్రామ శాఖ ప్రధాన కార్యదర్శి విప్పర్తి నారాయణను, కలసి ఆరోగ్య విషయాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఐటి అధ్యక్షుడు మట్టా నాగేంద్ర, మాజీ తెలుగు యువత అధ్యక్షులు పళ్ళ శ్రీను, జిల్లా బిసి సెల్ అధికార ప్రతినిధి పితాని కేశవ, మండల తెలుగు యువత ప్రధాన కార్యదర్శి గుబ్బల నాగ వీర వెంకటరమణ, మంద రాజేశ్, దొమ్మేటి బాబు ప్రసాద్, యాగన రాము, దూనబోయిన బాబి, కాగితాపల్లి సాయిరాం, కాగితాపల్లి సుబ్బారావు, పితాని ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్తలను పరామర్శిస్తున్న మండల టిడిపి శ్రేణులు

కార్టూ'నిజం'



మెట్ల రమణబాబుకు ఘన సత్కారం

ప్రజాశక్తి - అంబాజీపేట


మెట్ల రమణబాబుకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతున్న వక్కలంక బుల్లియ్య

మాజీ మంత్రి మెట్ల సత్యనారాయణ తనయుడు టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబును సోమవారం ఆ పార్టీ సీనియర్ నాయకులు, ఎన్‌టిఆర్ యువసేన అధ్యక్షులు వక్కలంక బుల్లియ్య ఘనంగా సత్కరించారు. అనంతరం రమణబాబుకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు నల్లా స్వామి, టిడిపి శ్రేణులు రమణబాబు కు శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా రమణబాబు పుట్టినరోజు వేడుకలు

అమలాపురం : రాష్ట్ర టిడిపి కార్య నిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు పుట్టినరోజు వేడుకలు సోమవారం అమలాపురంలోని ఆయన స్వగృహంలో అభిమానులు, టిడిపి శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి రమణ బాబు స్వగృహం వద్ద పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. ఈ సందర్భంగా ఎంపీ గంటి హరీష్ మాధుర్, అమలాపురం ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు, టిడిప నాయకులు, కార్యకర్తలు, బిజెపి నాయకులు, కార్యకర్తలు కూటమి నాయకులు వందలాది మంది అభిమానులు రమణబాబుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు రూ. 2.10 లక్షల విరాళం

ప్రజాశక్తి - ఆలమూరు

నగదు అందుచేస్తున్న ట్రస్ట్ చైర్మన్ వీర్రాజు తదితరులు

ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధి, మొదటి ఏడాది విద్యార్థుల ఫీజుల నిమిత్తం ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.2.10 లక్షల విరాళాన్ని అందజేశారు. కళాశాలలో విద్యార్థుల ఫీజుల నిమిత్తం రూ.1.63 లక్షలు, మంచినీటి సౌకర్యం, ఇన్వర్టర్ ఏర్పాటు తదితర అవసరాల కోసం రూ.50 వేలను మొత్తం రూ.2.10 లక్షలను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.నరసింహస్వామికి ఆలమూరు ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గుణ్ణం వీర్రాజు, జాయింట్ సెక్రెటరీ గారపాటి త్రిమూర్తులు సోమవారం అందజేశారు. డిగ్రీ మొదటి ఏడాది విద్యార్థుల ఫీజులను చారిటబుల్ ట్రస్ట్ భరిస్తుందన్నారు. అధిక సంఖ్యలో విద్యార్థులు కళాశాల్లో చేరి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ ఎం.బాలస్వామి, సీనియర్ అసిస్టెంట్ తోట మురళీకష్ణ తదితరులు పాల్గొన్నారు.

16న న్యాయ అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - అమలాపురం

అయినవిల్లి మండల ప్రజా పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఈ నెల 16న ఉదయం 11 గంటలకు మండల మహిళ సమాఖ్య భవనంలోమహిళలతో న్యాయ అవగాహనా సదస్సు నిర్వహించనున్నట్లు మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్ మరియు రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తి వి.నరేష్ సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాల బ్లాక్ స్థాయిలో జాతీయ మహిళా కమిషన్, విధాన్ సే సమాధాన్ పేరిట ఈ సదస్సు నిర్వహిస్తున్నామని అన్నారు. మహిళా చట్టాలు, హక్కులు, రక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. కావున ఈ న్యాయ అవగాహన శిబిరంలో మహిళలు పాల్గొని విజయ వంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.


వివరాలు తెలుసుకుంటున్న సత్యనారాయణ

భవిత కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కో ఆర్డినేటర్

ప్రజాశక్తి - ఐ.పోలవరం

టి.కొత్తపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ప్రాథమిక పాఠశాల వద్ద ఉన్న భవిత విద్యా కేంద్రాన్ని, జిల్లా సహిత విద్యా కోఆర్డినేటర్, ఎంవివి.సత్యనారాయణ సోమవారం సందర్శించారు. అక్కడ ఉన్న వికలాంగ పిల్లలను పరిశీలించారు .వారి తల్లితండ్రులను వికలాంగ పిల్లల అవసరాలు, పిల్లల పురోగతి ఎలా ఉన్నాదనే విషయాన్నీ తెలుసుకున్నారు. పిల్లల హాజరు, ఇతర అన్ని రికార్డ్స్ పరిశీలించారు. ప్రతి వారం జరిగే ఫిజియోథెరపీ క్యాంపును ఉపయోగించుకోవాలన్నారు. టీచర్స్ పనితీరును తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట జిల్లా ఎఎంఒ పి.రాంబాబు, భవిత కేంద్రం టీచర్స్ జి.రవి వర్మ,పావని, కాంప్లెక్స్ సిఆర్ ఎంటి కె.నారాయణరావు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

చోరీ కేసుల్లో ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి - సామర్లకోట

జల్సాలు, చెడు వ్యసనాలకు అలవాటు పడి వివిధ జిల్లాల్లో తాళాలు వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను అరెస్టు చేసినట్లు సిఐ ఎ.కృష్ణభగవాన్, క్రైం సిఐ అంకబాబు తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సంఖినేటిపల్లి మండలం అంతర్వేది గ్రామానికి చెందిన జిల్లెల రాకేష్, పశ్చిమ గోదావరి జిల్లా తణుకు మండలం జి.కొత్తూరు గ్రామానికి చెందిన చావల కృష్ణ సంయుక్తంగా తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దోపిడీలకు పాల్పడుతున్నారని తెలిపారు. వీరిద్దరిపై వివిధ జిల్లాల్లో 50కి పైగా దొంగతనం కేసులు ఉన్నాయన్నారు. మండలంలోని వేట్లపాలెం గ్రామంలో కుమ్మర వీధికి చెందిన గుర్రం సాయిబాబు నివాసంలో ఈ ఏడాది అక్టోబర్ 29న సుమారు 15 లక్షల విలువచేసే 186 గ్రాముల బంగారాన్ని నిందుతుల నుంచి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. చెడు వ్యసనాలు, జల్సాలకు అలవాటు పడ్డ వీరు వ్యూహాత్మకంగా ఎంపిక చేసుకున్న ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించి పక్కా వ్యూహంతో దోపిడీలు చేయడం అలవాటు చేసుకున్నారన్నారు. నేరాలు అదుపు చేసేందుకు వ్యాపార సంస్థలు నివాసాల వద్ద సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. ఇల్లు వదిలి ప్రయాణాలు చేసే టప్పుడు ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌లో ఆర్డర్ పెట్టుకోవాలని, ఆర్డర్ పెట్టుకోవడం తెలియకపోతే పోలీస్ స్టేషన్లో సంప్రదిస్తే ఎల్‌హెచ్‌ఎంఎస్ కెమెరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. అంతర్ జిల్లా దొంగల ముఠాను పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిన క్రైమ్ పార్టీ సభ్యులను ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అభినందించారు. అరెస్ట్ చేసిన ఇద్దరు నిందితులను కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి రిమాండ్ విధించారని వారు తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని మల్లేపల్లి గ్రామానికి ఒక యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివనాగు తెలిపారు. యువతి వయస్సు 20 సంవత్సరాలు ఉంటుందని, ఈ నెల 8వ తేదీ రాత్రి ఇంటి నుంచి ఆమె వెళ్లిపోయినట్లు అమ్మాయి తల్లి ఇచ్చిన రిపోర్టుపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని మరలావ గ్రామంలో సోమవారం నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 600 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ కెవివిడి.అర్జునరావు తెలిపారు. ఈ దాడుల్లో ఒక వ్యక్తి అక్రమంగా నిలవ చేసిన 6 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి - మామిడికుదురు

మోటారు బైకులు చోరీకి పాల్పడుతున్న అల్లవరం మండలం ఓడలరేవుకి చెందిన పాత నేరస్తుడు నల్లి బాలకృష్ణను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నగరం ఎస్ఐ చైతన్యకుమార్ తెలిపారు. నగరం, అమలాపురం, పాలకొల్లు పోలీస్ స్టేషన్ల పరిధిలో ఐదు మోటారు బైకులు దొంగలించాడన్నారు. గతంలో రాజోలు పరిధిలో 27, అమలాపురం పరిధిలో 16 మోటారు బైకులు చోరీ చేసి జైలుకు వెళ్లి వచ్చాడన్నారు.

సారా తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి - ఆలమూరు

నాటు సారా తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేశామని ఎక్సైజ్ సిఐ ఐడి.నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆలమూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మండపేట మండలంలోని ఏడిదలో స్కూటర్ మీద సారా తరలిస్తున్న ఆత్రేయపురం మండలం పేరవరానికి చెందిన యార్లగడ్డ ప్రసాద్, యార్లగడ్డ రాజును అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. ఈ దాడిలో 20 లీటర్ల నాటు సారాను, ఒక స్కూటర్ను సీజ్ చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - దేవరపల్లి

ఆగివున్న మూడు లారీలను ఒక లారీ ఢీకొన్న ప్రమాదంలో ఒక డ్రైవర్ మృతి చెందారు. దుద్దుకూరు ఫ్లైఓవర్ దిగువలో రాజ మహేంద్రవరం వైపు వెళుతున్న లారీ డ్రైవర్ దాని ముం దు వెళ్తున్న సెప్టిక్ ట్యాంకర్‌ను వెనుక నుంచి ఢీకొని ఎడమ వైపు ఉన్న సర్వీస్ రోడ్ లోనికి వెళ్లి అక్కడ టైర్లు కొట్టు వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో లారీ క్యాబిన్‌లో ఉన్నడ్రైవర్ సరికొండ అనంతరాజు (50) మృతి చెందినట్టు దేవరపల్లి ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

ఎదురెదురుగా ఢీకొన్న రెండు బస్సులు

ప్రజాశక్తి - సామర్లకోట

ఎదురేదురుగా వెళుతున్న రెండు బస్సులు ఢీ కొట్టుకోవడంతో మాధవపట్నం వద్ద కాకినాడ రోడ్‌లో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సోమవారం ఉదయం సామర్లకోట వైపునుంచి కాకినాడ వెళుతున్న ఆర్‌టిసి బస్సు, కాకినాడ వైపునుంచి సామర్లకోట వైపు వస్తున్న ఒక ప్రయివేట్ కళాశాల బస్సులు మాధవపట్టణం గ్రామం వద్ద ఢీ కొట్టుకున్నాయి. ఈ ప్రమాదంలో విద్యార్థులు, ప్రయాణికులకు ఎటువంటి గాయాల కాలేదు. ప్రమాదం కారణంగా రోడ్డుకు మధ్యలో బస్సులు నిలిచి పోవడంతో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోగా ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురయ్యాయి. ఉదయం కళాశాలలకు, ఉద్యోగాలకు హాజరయ్యే ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. సామర్లకోట ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది ప్రమాద స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

గురజనాపల్లిలో రీ సర్వే గ్రామ సభ

ప్రజాశక్తి - కరప

గురజనాపల్లి గ్రామంలో సోమ వారం రీ సర్వే గ్రామ సభ జరిగింది. తహశీల్దార్ ఎన్.సత్యనారాయణ రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ భూ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామంలో 41 అర్జీలు వచ్చాయని, ఇప్పటి వరకూ నిర్వహించిన 19 గ్రామ సభల్లో 1041 అర్జీలు వచ్చాయని తెలిపారు.

అర్జీల పరిష్కారం వేగవంతానికి చర్యలు: జెసి

ప్రజాశక్తి - అమలాపురం

ప్రజా సమస్యల పరిష్కారం వేదికలో అందే అర్జీల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని జెసి టి.నిషాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ లోని గోదావరి భవన్ నందు నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. జెసి టి.నిషాంతి, జిల్లా రెవెన్యూ అధికారి వి.మదనమోహన్రావు, డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ వి.శివశంకర్ ప్రసాద్ అర్జీదారుల సమస్యలను విని అందుబాటులో ఉన్న అధికారుల ద్వారా తగు పరిష్కార మార్గాలు చూపారు. ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీ దారుల నుంచి సుమారుగా 198 అర్జీలను వారు స్వీకరించారు. జెసి మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో పారదర్శకత, నిబంధనలు తప్పని సరిగా పాటించాలన్నారు ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుండి స్వీకరించిన అర్జీలపై పూర్తి స్పష్టతతో పరిష్కరించిన ప్పుడే ఆర్జీదారులు సంతృప్తి చెందడంతో పాటు పదే పదే ఆర్జీలు ఒకే అంశంపై పునరా వతం అయ్యే అవకాశం ఉండదని తెలిపారు. అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. పారదర్శకతతో నిబంధనలను పాటిస్తూ అధికారులు ప్రత్యేక దష్టి సారించి స్పష్టతతో కూడిన పరిష్కార మార్గాలు చూపాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను పరి ష్కరించే విధంగా చర్యలు తీసుకుం టుందన్నారు. ఆర్జీదారులు సంతృప్తి చెందేలా పారదర్శ కంగా పరిష్కారం ఉండాలన్నారు. గడువుతీరిన అర్జీలు ఏ స్థాయిలోను పెండింగ్ ఉండరాదన్నారు. సంతృ ప్తికరంగా

కలెక్టరేట్లో అర్జీలు స్వీకరిస్తున్న జెసి టి.నిషాంతి

పరిష్కారం చూపితే ప్రభుత్వ ఉద్దేశం నేరవేరుతుందనే సందేశం ప్రతి అధికారి దష్టిలో ఉండాలన్నారు. జిల్లాస్థాయి అధికారులు క్షేత్రస్థాయి అధికారులతో సమన్వయం చేసుకొని అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. తమ సమస్యలు పరిష్కారం అవుతాయ నే నమ్మకంతో ఆర్జీదారులు వినతులను సమర్పిస్తారని, ఆయా అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. కార్యక్రమంలో డిఇఒ శాంత లక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ సిహెచ్ ఎన్‌వి.కృష్ణారెడ్డి, డిఎస్ఒ ఉదయ భాస్కర్, సిపిఒ వెంకటేశ్వర్లు జిల్లా వ్యవసాయ అధికారి వి. బోసుబాబు, జిల్లా మేనేజర్ డిఐసి బికెపి.ప్రసాద్, జిల్లా నీటి యాజమాన్య పీడీ ఎస్.మధుసూద న్, జిల్లా ఉద్యాన అధికారి బివి.రమణ, జిల్లా పశుసం వర్ధక శాఖ అధికారి డాక్టర్ వెంకట రావు, డిఐ పిఆర్ఒ కె.లక్ష్మీనారాయణ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వాతావరణ మార్పులతో రైతుల్లో ఆందోళన

మారిన వాతావరణంతో బరకాలు కప్పతున్న రైతులు

ప్రజాశక్తి - రామచంద్రపురం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో సోమవారం వాతావరణంలో మార్పు వచ్చింది. దీంతో మూడు రోజులపాటు వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ అంచనాల ప్రకారం అల్పపీడనం తొలకరి పనులపై ప్రభావం చూపుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. తొలకరి వరి చేలు కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. దీనితో పాటు ధాన్యం నూర్పుళ్లు, మాసూళ్ళతో పనులు వేగం పుంజుకున్నాయి . వరి కోతలను హార్వెస్టర్లతో పోయడంతో ధాన్యం ఎగుమతులు ఊపొందుకున్నాయి. అయితే వాతావరణం ఒక్కసారిగా మార్పు సంభవించింది. వర్షాలు కురిస్తే చేతికి అందిన పంట పాడవుతుందని రైతులు కలప చెందుతున్నారు సుమారు 30 శాతం వరి కోతలు పూర్తికాగా మరో 70 శాతం వరిచేలు పంట పొలాల్లోనే ఉన్నాయి. బాగా పండిన వరిచేలకు భారీ వర్షాలు, ఈదురుగాలులు తోడైతే నేలకొరిగి పంట నష్టం ఏర్పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. సోమవారం మధ్యాహ్నం నుంచి వాతావరణ ఒక్కసారిగా మారిపోవడంతో రైతులు ఇప్పటికే నూర్పిడి చేసిన ధాన్యాన్ని బరకాలతో కప్పుకుంటున్నారు. మరో కొందరు వెంటనే ఎగుమతులను కొనసాగిస్తున్నారు.

ముమ్మరంగా మాసూళ్లు

తొలకరి పంటను మాసూళ్లు చేస్తున్న రైతులు

యాత్రికులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాల ఏర్పాటు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి కార్తీక మాసంలో వచ్చే యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు సోమవారం ఆలయ డిసి నల్లం చక్రధరరావు తెలిపారు. అలాగే ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు ఆయన రావులపాలెం రూరల్ సిఐ సిహెచ్.విద్యాసాగర్, ఎస్ఐ ఎస్.రాముతో సమావేశమయ్యారు. రోజురోజుకీ యాత్రికుల తాకిడి పెరుగుతున్న దృష్ట్యా వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పతిష్ట బందోబస్తు ఏర్పాటుపై సమీక్షించారు.

భీమేశ్వరాలయంలో అన్నదానం

ప్రజాశక్తి - రామచంద్రపురం

కార్తీక సోమవారం సందర్భంగా ద్రాక్షరామ భీమేశ్వర స్వామి ఆలయంలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 10 వేల మందికి అన్నదానం నిర్వహించారు. ఉదయం 11 గంటల నుంచి 5 గంటల వరకు భక్తులకు అన్నదానం చేశారు. కార్తీక సోమవారం సందర్భంగా భీమేశ్వర స్వామి ఆలయానికి యాత్రికులు పెద్ద ఎత్తున పోటెత్తారు.

వచ్చే నెల 14న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - అమలాపురం

ఆంధ్రప్రదేశ్ న్యాయ సేవాధి కార సంస్థ సూచనల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ వారు ఆదేశానుసారం డిసెంబర్ 14న మం డల న్యాయ సేవాధికార కమిటీ వారి ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తామని రెండవ అదనపు జిల్లా జడ్జ్ మరియు మండల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ అధ్యక్షులు వి నరేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ జాతీయ లోక్ అదాలత్ లో వివిద కోర్టులలో దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న సివిల్ కేసులు, బ్యాంక్ కేసు లు, చెక్ బౌన్స్ కేసులు మరియు రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులను పరిష్కరిస్తామని న్యాయమూర్తి వి .నరేష్ తెలి పారు.కావున కక్షిదారులు అధిక సంఖ్యలో పాల్గొని శాంతి యుతంగా సామరస్య పూర్వక వాతావరణంలో తమ తమ కేసులను పరిష్క రించుకోవాలని సూచించారు లోక్ అదాలత్ కేసులకు సంబంధించి ఎటువంటి ఫీజును చెల్లించనవసరం లేదని ఆయన స్పష్టం చేశారు.

ఆర్య వైశ్య నేత నరసింహమూర్తి మృతి

ప్రజాశక్తి - ఆలమూరు

మండల కేంద్రానికి చెందిన ఆర్యవైశ్య సంఘ సీనియర్ నాయకులు, సంఘ సంస్కర్త వెత్సా నరసింహమూర్తి (80) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. నరసింహమూర్తికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆర్యవైశ్య సంఘ నాయకులుగాను, రైస్ మిల్లర్ గాను నరసింహమూర్తికి మంచి గుర్తింపు ఉంది. నరసింహమూర్తి మృతి పట్ల మండల ఆర్యవైశ్య సంఘం నాయకులతోపాటు పలువురు నాయకులు ప్రజాప్రతినిధులు తమ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. మరణానంతరం తన కళ్ళు మరొకరికి చూపును ప్రసాదించాలనే లక్ష్యంతో భావించిన వెత్సా నరసింహమూర్తి తన కళ్ళను దానం చేసేందుకు ముందుగానే అంగీకరించారు. నరసింహమూర్తి మృతితో ఆయన కుటుంబ సభ్యులు కాకినాడ బాదం బాలకృష్ణ ఐ బ్యాంక్ సిబ్బందికి తెలిపారు. దీంతో సోమవారం ఐ బ్యాంకు సిబ్బంది ఆలమూరుకు చేరుకుని నరసింహమూర్తి కళ్ళను సేకరించారు.

కోటిపల్లి రేవు నిర్వహణకు కలెక్టర్ ఉత్తర్వులు

ప్రజాశక్తి - రామచంద్రపురం

కోటిపల్లి రేవు నిర్వహణకు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలు ఇవి.. కోటిపల్లి గోదావరి ఫెర్రీ రేవు గత ఐదు నెలలుగా మూతపడటంతో ప్రయాణికులు ఇక్కట్లకు గురవుతున్నారు. రేవుకు గతంలో బహిరంగ వేలం నిర్వహించిన పాట దారులు ఎవరూ ముందుకు రాకపోవడంతో పలుమార్లు రేవు పాట వాయిదా పడింది. దీనితో మండల పరిషత్ అధికారి ఎన్ శ్రీనివాస్ విషయాని జిల్లా పరిషత్ అధికారులకు, జిల్లా కలెక్టర్ దష్టికి తీసుకువెళ్లారు. రేవును గత పాట దారులు నెలకు రూ 7.36 లక్షల ప్రాతిపదికను అద్దెకు కొనసాగించాలని జిల్లా పరిషత్ కు కలెక్టర్ ఉత్తర్వులు ఇవ్వడంతో జిల్లా పరిషత్ నుంచి మండల పరిషత్‌కు ఆదేశాలు అందాయి. అయితే రేవుకు తాత్కాలిక రోడ్డు నిర్మాణం కొనసాగుతుందని శనివారం నాటికి పనులు పూర్తయితే రేవును అద్దె ప్రాతి పథిక న నిర్వహిస్తారని వారం రోజుల్లోగా ప్రయాణాలు పునరుద్ధరిస్తామని కె.గంగవరం ఎంపిడిఒ ఎన్. శ్రీనివాస్ విలేకరులకు తెలిపారు. ఇప్పటికే ఐదు నెలలుగా ప్రయాణాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు యానాం మీదుగా అమలాపురం 50 నుంచి 60 కిలోమీటర్లు ప్రయాణించి అమలాపురం చేరుకుంటున్నారు కోటిపల్లి మీదుగా సుమారు 25 కిలోమీటర్లు దూరం కలిసి వస్తుందని ప్రయాణికులు వ్యాఖ్యానిస్తున్నారు.

అభివృద్ధి, సంక్షేమాలకు వారధిగా బడ్జెట్

ప్రజాశక్తి - కొత్తపేట

అభివృద్ధి సంక్షేమాలకు వారధిగా రాష్ట్ర బడ్జెట్ ఉందని కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మొదటి సారిగా బడ్జెట్ ను ప్రవేశపెట్టారు ఈ సందర్భంగా సత్యానందరావు మాట్లాడుతూ సిఎం నారా చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారథ్యంలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు అలాగే అభివృద్ధితో పాటు సంక్షేమాన్ని ప్రజలకు అందించేందుకు ప్రభుత్వం కషి చేస్తోందని అన్నారు ఈ మేరకు ఈరోజు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశ పెట్టిన బడ్జెట్ పూర్తిగా ప్రజల ఆమోదయోగ్యంగా ఉందని చెప్పారు. కూటమి ప్రభుత్వం పేదల ప్రభుత్వం అని వారికోసం బడ్జెట్ లో విద్య, వైద్యానికి పెద్దపీట వేశామని తెలిపారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఎస్. యానాం గ్రామస్తులు

'ఎస్.యానాం'ను అభివృద్ధి చేయాలని డిమాండ్

ప్రజాశక్తి - అమలాపురం

వేదాంత ఆయిల్ కంపెనీ ఎస్.యానాం గ్రామాన్ని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద గ్రామ ప్రజలు నిరసన తెలిపారు.ఈ సందర్భంగా ఎస్.యానాం గ్రామస్తులు మాట్లాడుతూ . గ్రామ ప్రజలకు వేదాంత ఆయిల్ కంపెనీ ఇచ్చిన హామీలు తక్షణం అమలు చేయాలని గ్రామాన్ని అన్ని విధాల అభివద్ధి చేయాలని నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పది రోజుల్లో తాము పెట్టిన డిమాండ్స్ పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో వేదాంత ఆయిల్ కంపెనీ కార్యకలాపాలు స్తంభింప చేసి ఉద్యమాన్ని ఉధతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం గ్రీవెన్స్ సెల్ లో పలువురు అధికారులను కలసి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జోగి రాజా రాజేశ్వరి ఎంపిటిసి సభ్యులు పెట్ట అప్పారావు మాజీ సర్పంచ్ లంకె భీమరాజు, పులిశెట్టి దొరబాబు, రేవు తిరుపతిరావు, అయితాబత్తుల రాజశేఖర్ ,పలచోల్ల బుజ్జి, మన్నే వెంకటేశ్వరరావు, కాండ్రేగుల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు వినతిపత్రాల అందజేత

ఉప్పలగుప్తం: ఎస్.యాశ్రీవం గ్రామాన్ని అభివద్ధి చేసి గ్రామస్తులకు ఉపాధి కల్పించాలంటూ ఆ గ్రామస్తులు సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. 30 సంవత్సరాలు గా చమురు నిక్షేపాలు వెలికితీసి వేలకోట్లు రూపాయలు తరలించుకుపోతూ తమ గ్రామప్రజల ఉపాధి దెబ్బతిసిన వేదాంతా ఆయిల్ కంపిని గ్రామాన్ని అభివద్ధి చేయాలని డిమాండ్ చేశారు. గ్రామ నిరుద్యోగులకు ఉపాధి కల్పించి గ్రామాన్ని సమగ్రంగా అభివద్ధి చెయ్యాలన్న డిమాండ్ లతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తహశీల్దార్ సుబ్రహ్మణ్యం కు అందజేశారు. పదిరోజుల్లో గ్రామ సమస్యలు పరిష్కరించేలా వేదాంతా కంపిని ఇచ్చిన హామీలు అమలు చెయ్యడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఎస్ఐ,సిహెచ్ రాజేష్ కు కూడా వారు వినతిపత్రం అందించారు.వినతి పత్రం అందజేసిన వారిలో గ్రామ పెద్దలు లంకే భీమరాజు, రేవు తిరుపతిరావు, పెట్టా అప్పారావు, ఉలిశెట్టి దొరబాబు, పలచోళ్ళ బుజ్జి,కోటిపల్లి రాజు, తదితరులు పాల్గొన్నారు.

దళిత చైతన్య వేదిక సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి - రాజోలు

సమాజానికి దళిత చైతన్య వేదిక చేస్తున్న సేవలు ప్రశంసనీయమని రాజోలు వైస్ ఎంపిపి పొలుమూరి శ్యాంబాబు అన్నారు. ఈ మేరకు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమజిల్లా రాజోలు మండలం వేగివారిపాలెం గ్రామంలో సోమవారం పేదరికంతో బాధపడుతున్న కుటుంబానికి దళిత చైతన్య వేదిక సభ్యులు 25 కేజీల బియ్యంతో పాటుగా నిత్యావసర కిరాణా సరుకులను అందించారు. అనంతరం దళిత చైతన్య వేదిక వ్యవస్థాపకుడు బత్తుల మురళీకష్ణ మాట్లాడుతూ మిత్రుల సహకారంతో దళిత చైతన్య వేదిక పే బ్యాక్‌టుద సొసైటీ ప్రోగ్రాం ద్వారా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దళిత చైతన్య వేదిక నాయకులు బత్తుల జనార్ధనరావు, మట్టా సురేష్, చిలకపాటి శ్రీధర్, జిల్లెళ్ళ వినోద్, మందపాటి మధు, కాకర్ల డేనియల్ పాస్టర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ నేత 'అబ్బాయి' పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, ఎఐసిసి కో ఆప్షన్ సభ్యులు ఉప్పలగుప్తం పంచాయతీ చీకట్లపాలెం కు చెందిన చీకట్ల అబ్బాయి 88 వ పుట్టినరోజు వేడుకలను ఆయన స్వగృహం వద్ద సోమవారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ సభ్యులు గిడుగు రుద్రరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కార్యక్రమంలో ఎపిసిసి ఉపాధ్యక్షులు కొత్తూరి శ్రీనివాస్, ఎపిసిసి సభ్యురాలు దోనిపాటి విజయలక్ష్మి,యార్లగడ్డ రవీంద్ర,గిడ్డి నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా మీడియా కోఆర్డినేటర్ దామిశెట్టి జయ, మాజీ ఎంపిపి జోగి అర్జునరావు, అమలాపురం పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వంటెద్దు బాబి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. పార్టీలకతీతంగా ఆయా రాజకీయ పార్టీల నాయకులు అబ్బాయిని సత్కరించారు.

ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ప్రజలకు ఏవైతే హామీలు ఇచ్చిందో వాటన్నింటిని అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ సభ్యులు గిడుగు రుద్రరాజు డిమాండ్ చేశారు. చీకట్లపాలెంలో చీకట్ల అబ్బాయి అధ్యక్షతన సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఎపిసిసి ఉపాధ్యక్షుడు కొత్తూరి శ్రీనివాస్, ఎపిసిసి సభ్యురాలు దోనిపాటి విజయలక్ష్మి, యార్లగడ్డ రవీంద్ర, గిడ్డి నాగేశ్వరరావు, దామిశెట్టి జయ,జోగి అర్జున రావు తదితరులు పాల్గొన్నారు. ఉప్పలగుప్తంకు చెందిన వైసిపి నాయకుడు పండు వీర వెంకట సత్యనారాయణ సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. సత్యనారాయణకు కాంగ్రెస్ కమిటీ సభ్యులు గిడుగు రుద్రరాజు పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

పుట్టినరోజు కేక్ కట్ చేస్తున్న అబ్బాయి, రుద్రరాజు

హెల్త్ క్లబ్‌కు అవార్డుల ప్రదానం

ప్రజాశక్తి - అమలాపురం

ఈనెల 10 వ తేదిన తుని పట్టణంలో ఈ నెల 10న నిర్వహించిన అంతర్జాతీయ జిల్లా స్థాయి కాన్ఫరెన్స్ నందు అమలాపురం హెల్త్ క్లబ్ కి అవార్డులు ప్రదానం చేశారు. ఒక అవార్డు బెస్ట్ హెల్త్ సర్వీసింగ్ గాను రెండో అవార్డు ఉత్తమ ప్రెసిడెంటు బోణం సత్య వరప్రసాద్ కు వాకర్స్ అంతర్జాతీయ అధ్యక్షుడు మురళీమోహన్ రావు జిల్లా గవర్నర్ శివాజీ చేతుల మీదుగా అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భగాద సత్య వరప్రసాద్‌ను సోమవారం జరిగిన కార్యక్రమం లో పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిగా డాక్టర్ రాఘవేంద్రరావు, డాక్టర్ సి.హెచ్ విష్ణుమూర్తి, కార్యదర్శి వలవల నాయుడు, ట్రెజరర్ రాజా, అంతర్జాతీయ కోఆర్డినేటర్ పచ్చిగోళ్ళ శ్రీనివాసరావు, ఎలక్ట్రిక్ గవర్నర్ సప్ప నాగేశ్వరావు, ఏరియా కోఆర్డినేటర్ గోకరకొండ నాగేంద్ర, నూకల సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

శెట్టిబలిజ వన సమారాధన ఏర్పాట్లపై సమావేశం

ప్రజాశక్తి - రామచంద్రపురం

నియోజవర్గం శెట్టిబలిజ కార్తీక వన సమారాధన ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేయుటకు నియోజకవర్గం శెట్టిబలిజ సంఘం సోమవారం సమావేశమైంది. వెంకటాయపాలెంలోని పిల్లి అప్పారావు ఆడిటోరియం(బిసికమ్యూనిటీ హాల్) ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఈ నెల 23 శనివారం వెంకటాయపాలెం బిసి కమ్యూనిటీ హాల్ లో సంఘం వన సమారాధనఏర్పాటు చేయాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలోశెట్టిబలిజ నియోజకవర్గ తాత్కాలిక అధ్యక్షులు నరాల ఏడుకొండలు, కట్టా సూర్యనారాయణ పంపన వెంకటరమణ, ఎంపిపి పంపన నాగమణి, సర్పంచులు శ్రీమతి ఎల్లమెల్లి సతీష్ కుమారి, వీరబోయిన సూరిబాబు, వీ్రరాజు, వాసంశెట్టి లక్ష్మీనారాయణ కడలి రామకష్ణ , దంగేటి భద్ర రావు నున్నబోయిన ప్రసాద్ గుబ్బల లక్ష్మీ గణపతి రావ్, టేకుమూడి సత్యనారాయణ , వాసంశెట్టి శ్యామ్ మేడిశెట్టి ఇజ్రాయిల్, పంపన సుబ్బారావు, కొప్పిశెట్టిలక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు .

ఎండియు ఆపరేటర్‌పై ఫిర్యాదు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ప్రభుత్వం ప్రజలకు ఇంటి వద్దే రేషన్ అందించేందుకు ఏర్పాటు చేసిన ఎండియు వాహనాల వద్దే ప్రభుత్వ నిర్ణయించిన ధర కంటే అధిక ధరలు వసూలు చేస్తున్నాడని లబ్ధిదారుడు చేసిన ఫిర్యాదు మేరకు అధికారులు వాంగ్మూలం నమోదు చేశారు. ఈ మేరకు ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని రాజుపాలెంలో రేషన్ సరఫరా చేసే ఎండియు ఆపరేటర్ జనిపల్లి నవీన్ కుమార్ కందిపప్పు, పంచదార ప్రభుత్వ నిర్ణయించిన ధరల కంటే అధికంగా సొమ్ము వసూలు చేస్తున్నాడని, ఆ గ్రామానికి చెందిన లబ్ధిదారుడు చింతకింద రామకష్ణ అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై సోమవారం రెవెన్యూ అధికారులు విచారణ నిర్వహించి రిపోర్ట్ ను జెసికి నివేదించినట్లు సమాచారం.

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఆర్‌డిఒ

ప్రజాశక్తి - ఆలమూరు

ఉభయగోదావరి జిల్లాల టీచర్స్ ఎంఎల్‌సి ఎన్నికల్లో భాగంగా స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని కొత్తపేట రెవెన్యూ డివిజనల్ అధికారి పి.శ్రీకర్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సలహాలు సూచనలు ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కెజె.ప్రకాష్‌బాబు ఎంపిడిఒ ఐ.రాజు, డిప్యూటీ తహశీల్దార్ సుబ్బరాజు, మండల పరిషత్ ఎఒ మెహర్ ప్రకాష్, సర్వేయర్ ప్రభావతి, సిబ్బంది పాల్గొన్నారు.

మహారాజశ్రీ అమలాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
ఐ.ఎ.నెం.317/2021ఇన్
ఓ.ఎస్.నెం.36/2021

బిట్విన్:
వాడ్రేవు సీతారామాంజనేయ ప్రసాద్ ...పిటిషనరు-వాది
మరియు
గిడుగు అనంతలక్ష్మి మరియు 2 అదర్స్ ...రెస్పాండెంట్లు-ప్రతివాద్లు
2. గిడుగు శివ లక్ష్మి బాల విజయ ప్రశాంతి,తండ్రి (లేటు) నాగేశ్వరరావు, w/o.వేణుమాధవ,డోరు నెం.4-150, గిడుగు వారి పాలెం, మొండెపులంక, పి.గన్నవరం మండలం
3. గిడుగు దేవి రమామణి, తండ్రి (లేటు) నాగేశ్వరరావు, డోరు నెం.4-150, గిడుగు వారి పాలెం, మొండెపులంక, పి.గన్నవరం మండలం
...2,3 రెస్పాండెంట్లు-ప్రతివాదులు

ఈ నంబరులో వాది, చనిపోయిన మీ తండ్రి లేటు గిడుగు నాగేశ్వరావు గారి నుండి తనకు రావలసిన ప్రోనోటు బాకీ వసూలు నిమిత్తం ఆయిన యొక్క వారుసులైన మీపై, మీ తల్లి గారిపై దాఖలు చేసిన దావాలోని, నాగేశ్వరావు గారి అస్తులను ఎటాచ్‌మెంటు చేయమని దాఖలు చేసిన పై నంబరు పిటిషనులో మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపించినను తీసుకోనందున కోర్టు వారు పబ్లికేషను ద్వారా నోటీసులు ఆర్డరు వేసినారు. సదరు పిటీషను వాయిదా **22-11-2024** అయి ఉన్నది.

కావున సదరు తేదిని పై కోర్టు వారి ఎదుట ఉదయం **గం.10.30**లకు స్వయంగా గాని ప్లీడరు గారి ద్వారా గాని హాజరై మనవి చేసుకోవలెను. లేనిచో పిటిషను పరోక్షమందు తీర్మానించబడును.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వు మేరకు //
ఎన్.వి.కె.శర్మ
అడ్వకేట్, అమలాపురం
సెల్.9849142007,9849276623

మహారాజశ్రీ ముమ్మిడివరం సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
O.S. No. 7/2024

Between:
గుత్తుల రవీంద్రనాథ్ -వాది
AND
కొల్లూరి సతీష్ -ప్రతివాది
టు:
కొల్లూరి సతీష్, S/o. బుల్లి హనుమంతరావు, డో.నెం. 11-2-32, నల్లవంతెన ఏరియా, అమలాపురం, అమలాపురం మున్సిపాలిటీ, డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, AMP Prl. Jr.C.J.

ఈ పై నెంబర్ దావాను వాది మీపై మీరు వ్రాయించి ఇచ్చిన ప్రామిసరీ నోటు బాకీ అసలు ఫాయిదాలు తాలూకు వసూలు మున్నగు పరిహారములు కోరుచూ దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు సమన్లు నిమిత్తం మరియు మీ హాజరు నిమిత్తం **వాయిదా 02-12-2024వ** తేదీ అయి వున్నది. కావున మీరు **వాయిదా రోజున ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, అడ్వకేట్ వారి ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. అట్లు కాని ఎడల మీ పరోక్షమందున తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి అనుమతితో)
శ్రీ కుచ్చర్లపాటి తాతంరాజు
శ్రీ గుత్తుల శ్రీనివాసరావు
అడ్వకేట్స్, ముమ్మిడివరం
ముమ్మిడివరం సెల్:9440041751
ది.11-11-2024 9440528135

మహారాజశ్రీ రాజమండ్రి 2వ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. 38/2024

Between:
Marre Krishnaveni ***...Plaintiff***
AND
To:
Adapa Anantha Lakshmi, W/o. Durga Prasad, D.No. 78-1-7, Syamala Nagar, Rajahmundry
...1st Defendant

పై నెంబరు దావాలో 1వ ప్రతివాది అయిన మీకు దావా సమన్లు అమలు జరుగుటకు గాను **14-11-2024కి వాయిదా అయి వున్నది.** అందు విషయమై మీకు ఏమయినా ఆక్షేపణలు ఉన్నచో వాయిదా రోజున **ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరు అయి తెలియపర్చుకోవలెను. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును.

(By Order of the Court)
K.V.V.S.PRASAD
Advocate
రాజమండ్రి Danavaipeta
ది.10-11-24 Rajahmundry-3

IN THE HONOURABLE COURT OF THE III ADDL. JUNIOR CIVIL JUDGE AT :: VISAKHAPATNAM
O.S.No. 477 of 2024

Between :
D. Raja Sekhar ... Plaintiff
And
M. Srinivasa Reddy ... Defendant

NOTIECE

To,
Mallidi Srinivasa Reddy S/o. M. Surapu Reddy Residing at D.No.7-16-2/1, Drivers Colony, Old Gajuwaka, Visakhapatnam, Pin - 530026.
Presently Residing at D.No. 7-543, Ramareddy Nagar, Anaparthy, East Godavari Dist - 533342.

Please take Notice that above matter Stands posteed to **12-12-2024** for appearance of the defendant and he shoudappear before the above Hon'ble Court on that day in Person or through an Advocate, and if fails to appear on that day at 10-30 a.m. The matter will be heard and decided exparte.

P. SURYA NARAYANA
Advocate
Visakhapatnam